# లేత మనసు

**ద్వితీయ బహుమతి**
**(రూ. 25/-)**

నాంచారి మా యింట్లో పనిమనిషిగా కుదిరి యేడాది కావస్తున్నది. పాపం దానిదో విషాదగాథ! అది మనకు అప్రస్తుతంగాని, మొత్తమ్మీద మొగుడేలుకోకుండా లోకం మీదకి వదిలాడు. దాని కష్టాలు చాలవో! అన్నట్లు రెండేళ్ళ కొడుకుకూడా దానికొంగుకు శాపంలాగ తగులుకున్నాడు. గడవాలిగా మటి! ఆ యింటా ఈ యింటా వూడిగం చేసుకుంటోంది. కాలు సాగినప్పటినుండి, పిల్లడు వదలి వుండడం లేదని వాడిసికూడా తనతో పాటు తీసుకురావడం మొదలుపెట్టింది. వాఁడు అలాగే దాని కొంగు పట్టుకు తిరుగుతూ పనులకు అడ్డాలు వస్తూ, కేకలేస్తే, యిల్లెగిరే లాగు రాగాలు తీస్తూ ఏదో కాలక్షేపం అయిపోయాడు మా యింట్లో.

ఇక మా యింట్లో సంగతి. మా అన్నయ్య బి. కామ్, చెల్లాయ్ ఎస్సెల్సీ మా నాన్నగారు, ఊరిలో సవాలక్ష గౌరవ పదవులు. దానితో ఉదయం పూడ్చిన యిల్లు రాత్రయేసరికి "సరస్వతీ సముద్రం"గా తయారయేది. అందుచేత, దాసీదానిచేత కసవు చిమ్మేటప్పుడు కాగితాలన్నీ ఒకమూల జాగ్రత్త చేయించి వాటిని ఎవరమో ఒకరం తనిఖీచేసి, వాటిని పారవేయించడం రివాజయింది.

ఒకనాడు, ఈ యేడ్చే రాగాలు తీసే గుంటడికి ఏదయినా పనిచెపితే ఊరుకుంటాడేమోనని మాఅన్నయ్య వాడిని పిలిచి, ఒరే! ఏ కాగితం కనుపించినా తనకో, నాకో ఇమ్మని చెప్పాడు. ఇక ఆరోజునుండి వాడు "యువర్ మోస్ట్ ఒబీడియంట్ సర్వెంట్" లాగు పొట్లాలకాగితాల దగ్గరనుఁడి మాకు చేరవేయడము మొదలుపెట్టాడు. ఒక్కోసారి మాఅన్నయ్య వీడికీ ఈపని యెందుకు చెప్పానురా దేవుడా! అని వాడిపైన విసుక్కుంటూ, నూటికోసారి దేవుడిని తలచేవాడు. అసలిప్పుడు వాడు మానమన్నా మానే స్థితిలో లేడు.

పనంతా అయిన తరువాత ఇంట్లోచెప్పి వెళ్ళిపోవడం పరిపాటి. ఒకనాడు, అది యింటికి వెళ్ళిపోయే సమయానికి తల్లీకొడుకు కీచులాడుకుంటున్నారు. వాడేదో మారాం చేస్తున్నాడు. దాన్ని గుంజుతూ నానా హంగామా చేస్తున్నాడు. చివరికి

అది వాడిని అదలించింది. తప్పని సరయి రెండు అంటించింది. (దెబ్బలు సుమా !). ఈ గోలంతా చూస్తున్న నేను ఏమిటీ ! గొడవని అడిగాను. ఏమీలేదంది. వాడినే, కాసిని మరమరాలు పెట్టి, బుజ్జగించి ఏమిట్రా అని అడిగాను.

'కాతం' అన్నాడు. వాడి భాషకు ఈమధ్యనే అలవాటు పడ్డాముకనుక ఏంకాగితం అన్నా. ఔను, ఔనంటూ తలూపాడు, నాకు నవ్వొచ్చింది. వీడేదో కాగితాల పిచ్చిసూరయ్యల్లే తయారయేలా వున్నాడని. మళ్ళీ రెట్టించి అడిగితే వాళ్ళమ్మ నడికట్టు చూపుతూ 'కాతం ఈ తల్లా' అన్నాడు. ఏమన్నా నాంచారమ్మ తల్లి బొడ్లో దోపిందేమోనని అనుమానించి కాస్త దాన్ని డబాయించాను. అప్పటికీ ఏమీ ఎరగనన్నది. నిజం చెబుతావా ? పోలీసుల్ని పిలవమన్నావా ? అని ఫోన్ ఎత్తాను. గబుక్కున బొడ్లోంచి పది రూపాయల కాగితం తీసి క్రింద పడేసి కాళ్ళు పట్టుకుంది. ఏమిటే ఈ అఘాయిత్యం అంటే, 'ఎప్పుడూ ఎరగ నమ్మగారూ, బుద్ధి గడ్డితిని, ఈపని చేశాను. బగమంతుడు మంచి శాత్తే చేశాడు' అని అఘోరించింది. దాని వాలకం చూస్తే అరితేరిన దానిలా కనుపించలేదు, అమాయకమ్మనిషిలానే వున్నది ఇంతలో అందరూ ఇంట్లోంచి వచ్చేశారు. అసలు జరిగింది చెప్పమన్నాం.

'ఏం లేదమ్మగారూ ! ఊడుస్తాంటే, ఈపొద్దుటేలబట్టల దండెం కాడ పది కాయితం కాపడింది. మా అబ్బిగాడు గబాలున అది తీసుకున్నాడు, మీకియ్యాలని. అడ ఎవరూ లేరుగందా అని నేను అడిదగ్గర్నుంచి లాక్కున్నాను. అడు మీకియ్యాలని గొడవ సేత్తానే వున్నాడు. పోయేతప్పుడు ఇయ్యొచ్చులేరా అన్నాను. ఇప్పుడు నా దుంపతెంపినాడు' అని ముగించింది. దాన్ని అందరం తలకొకసారి నామావళి చదివి, ఇలాంటి పనులెప్పుడూ చేయొద్దని బుద్ధిచెప్పాం.

ఆరాత్రి మా నాన్నగారికి విషయం తెలిసింది. ఆయన ఈ సంగతి విని 'ఏ అంతస్తులో పుట్టినా లేత మనసు, లేత మనసే—

నిజంగా వాడే కనుక అదే పద్ధతిలో పెంచబడితే నిజాయితీగల వ్యక్తి అయి తీరుతాడు నాంచారితో చెప్పు, వాడి ఉద్యోగం మనింట్లో అడ్వాన్స్ బుకింగ్ అయిందని. ప్రస్తుతానికి మటుకు ఈ కథానాయకునికి ఒకలాగూ, చొక్కా శాంక్షన్ చేశా'మని నవ్వుతూ ముగించారు.

ఆర్. అనసూయ
బి. ఏ. తృతీయ
ఆంధ్ర జాతీయ కళాశాల
మచిలీపట్టణము.